క్లుప్తంగా

బర్కత్ అలీకి అభినందనలు



కార్పొరేటర్ బర్కత్ అలీని అభినందిస్తున్న గుజ్జు వెంకటరెడ్డి, పార్టీ నాయకులు

మద్దిపాలెం: వైఎస్సార్‌సీపీ ఉమ్మడి విశాఖ మైనారిటీ రీజినల్ ఇన్‌చార్జిగా 53వ వార్డు కార్పొరేటర్ బర్కత్ అలీ నియమితులయ్యారు. ఈ సందర్భంగా బుధవారం ఆయనను వార్డు కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు గుజ్జు వెంకటరెడ్డి, పార్టీ నాయకులు, కార్యకర్తలతో సత్కరించి అభినందనలు తెలియజేశారు.

మహిళలకు శుభాకాంక్షలు..

మహిళా దినోత్సవం సందర్భంగా 53వ వార్డు కార్పొరేటర్ బర్కత్ అలీ పార్టీ కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ మహిళా నాయకులు, కార్యకర్తలకు శుభాకాంక్షలు తెలిపారు. వారిని సన్మానించి బహుమతులు అందజేశారు.

సైబర్ నేరాలపై అవగాహన



మాట్లాడుతున్న సైబర్ క్రైం సీఐ భవానీప్రసాద్

మద్దిపాలెం: అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా బుధవారం హెచ్‌పీసీఎల్ కంపెనీలో పనిచేసే మహిళలకు ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. నగర పోలీస్ కమిషనర్ సీహెచ్ శ్రీకాంత్ ఆదేశాల మేరకు సైబర్ క్రైం సీఐ కె.భవానిప్రసాద్ ఆర్ అండ్ బీ దరి హోటల్ ఫెయిర్‌ఫీల్డ్ మారియట్ హోటల్లో సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ప్రస్తుత రోజుల్లో సోషల్ మీడియాలో మహిళలపై జరుగుతున్న సైబర్ నేరాలను వివరిస్తూ ఆన్‌లైన్‌లో పరిచయమైన వ్యక్తులతో ఎటువంటి వ్యక్తిగత విషయాలను పంచుకోవద్దని, అటువంటి వ్యక్తులకు దూరంగా ఉండాలని సూచించారు. అలా జరిగినప్పుడు తక్షణమే వాటిపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను గురించి వివరించారు. ఎటువంటి సైబర్ ఫిర్యాదులకైనా 1930 నంబర్‌కు వెంటనే కాల్ చేయాలని సీఐ సూచించారు.

జోరుగా రోడ్డు మరమ్మతులు



ఎఫ్‌సీఐ గొడౌన్ వద్ద జరుగుతున్న రోడ్డు పనులు

మద్దిపాలెం: జాతీయ రహదారి దరి ఎఫ్‌సీఐ గొడౌన్ వద్ద రోడ్డు మరమ్మతు పనులు జోరుగా సాగుతున్నాయి. రానున్న జీ–20 సదస్సులో భాగంగా బుధవారం రాత్రి అధికారులు దగ్గరుండి పనులు చేయిస్తున్నారు. తారురోడ్డు కావడంతో రోలర్, మిగతా పరికరాలతో శరవేగంగా తీర్చిదిద్దుతున్నారు. వర్క్ ఇన్‌స్పెక్టర్, ఇతర అధికారులు అక్కడే ఉండి పని జరుగుతున్న తీరును పరిశీలిస్తున్నారు.

నాటి ఉద్యమం.. నేటి తరానికి స్ఫూర్తి

సీతమ్మధార: విశాఖ ఉక్కు–ఆంధ్రుల హక్కు అనే నినాదం నేపథ్యంగా జరిగిన నాటి ఉక్కు ఉద్యమం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని ఐఎన్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి కె.ఈశ్వరరావు అన్నారు. విశాఖ ఉక్కును విక్రయించరాదని డిమాండ్ చేస్తూ అఖిలపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యంలో చేపట్టిన నిరాహార దీక్ష బుధవారం నాటికి 704వ రోజుకు చేరింది. దీక్షలో కాంట్రాక్ట్ కార్మికులు కేంద్ర ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఈశ్వరరావు మాట్లాడుతూ రైతులు సాగించిన పోరాట ఫలితంగా మోదీ ప్రభుత్వం మూడు వ్యవసాయ చట్టాలను వెనక్కి తీసుకుందని, స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు అటువంటి పోరాటాలు చేయక తప్పదన్నారు. ఉక్కు నిర్వాసితులు చేసిన ప్రాణత్యాగాలను బీజేపీ సర్కారు గుర్తు చేసుకోవాలన్నారు. స్టీల్ ప్లాంట్‌కు సొంత గనులు కేటాయిస్తే దేశంలో నంబర్ వన్ పరిశ్రమగా ఎదుగుతుందన్నారు. దీక్షలో ఐఎన్‌టీయూసీ హెచ్‌పీసీఎల్ కాంట్రాక్ట్ లేబర్ యూనియన్ నాయకులు తాతబాబు, వై.నర్సింగరావు, టి.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పబ్లిక్ డిమాండ్

వీధిలైటు వెలగక ఇబ్బందులు

మద్దిపాలెం: జీవీఎంసీ 53వ వార్డులోని పలు ప్రాంతాల్లో కొన్ని చోట్ల రాత్రి పూట వీధిలైట్లు వెలగడం లేదు. ముఖ్యంగా ఎఫ్‌సీఐ పార్కు దగ్గర లైన్‌లో ఓ వీధి దీపం వెలగకపోవడంతో అంధకారం నెలకొంది. ఆ రోడ్డులో మట్టి దిమ్మలు ఉండటంతో చీకట్లో రాకపోకలు సాగించే స్థానికులు, వాహన చోదకులు ఇబ్బంది పడుతున్నారు. రాత్రి పూట నడిచి వెళ్లాలంటే తంటాలు పడాల్సిందే. సంబంధిత అధికారులు స్పందించి వీధిలైటు వెలిగించాలి.

– నవీన్, ఎఫ్‌సీఐ పార్కు ఏరియా



ఎఫ్‌సీఐ పార్కు వద్ద రోడ్డులో వెలగని విద్యుత్ లైటు

అంధకారంలో మెయిన్ రోడ్డు



ఎఫ్‌సీఐ గూడౌన్ రోడ్డులో వెలగని లైటు

మద్దిపాలెం: జాతీయ రహదారి సర్వీస్ రోడ్డు నుంచి ఎఫ్‌సీఐ గొడౌన్ రహదారిలో అంధకారం నెలకొంది. ఈ రోడ్డులో ఒకటి రెండు చోట్ల వీధి లైట్లు వెలగడం లేదు. దహైవే నుంచి లోపలికి వెళ్లే ప్రధాన రహదారి కావడంతో రాత్రి వేళలో రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నాం. ముఖ్యంగా మహిళలు రాత్రి పూట ఒంటరిగా వెళ్లాలంటే ఆందోళనగా ఉంటోంది. సంబంధిత అధికారులు స్పందించి వీధిలైట్లు ఏర్పాటు చేయాలి.

– దేముడు, శివనగర్

రోడ్డెక్కిన మురుగుతో అవస్థలు

సీతంపేట: జీవీఎంసీ 25వ వార్డు సీతంపేట రెల్లి వీధి రోడ్డులో బుధవారం ఉదయం డ్రెయిన్ పొంగి ప్రవహించింది. డ్రెయిన్‌లో చెత్త పేరుకుపోవడంతో మురుగునీరు రోడ్డెక్కి ఏరులై ప్రవహించింది. పాదచారులు, వాహన చోదకులు మురుగు నీటిలో వెళ్లేందుకు అవస్థలు పడ్డారు. రెల్లి వీధి రోడ్డులో తరచూ పారిశుద్ధ్య సమస్యలు తలెత్తుతున్నాయి. డంపర్ బిన్ వద్ద, డ్రెయిన్‌లో చెత్త పేరుకుపోవడంతో అపారిశుద్ధ్యం నెలకొంటోంది.



సీతంపేట రెల్లి వీధిలో రోడ్డెక్కి ప్రవహిస్తున్న మురుగు

సంబంధిత అధికారులు స్పందించి మెరుగైన పారిశుద్ధ్యం అందించేలా చర్యలు చేపట్టాలి.

– బి.రమణబాబు, రెల్లి వీధి

సీతంరాజును గెలిపించాలని విస్తృత ప్రచారం



14వ వార్డులో గ్రాడ్యుయేట్‌కు కరపత్రం అందిస్తున్న కె.కె.రాజు



46వ వార్డులో పట్టభద్రులను అభ్యర్థిస్తున్న డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్

సీతమ్మధార: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ మద్దతు అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌ను గెలిపించాలని జోరుగా ప్రచారం సాగుతోంది. ఇందులో భాగంగా బుధవారం 14వ వార్డు కార్పొరేటర్ కె.అనిల్‌కుమార్‌రాజు ఆధ్వర్యంలో నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు వార్డులో విస్తృతంగా ప్రచారం చేపట్టారు. సీతంరాజు సుధాకర్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని గ్రాడ్యుయేట్లను అభ్యర్థించి ఓటర్ స్లిప్స్, కరపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో వార్డు నాయకులు బల్ల శ్రీను, కె.సుశీల, ప్రవీణ్, ధనరాజు, రమణ, బాబు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

46వ వార్డులో..

కంచరపాలెం: జీవీఎంసీ 46వ వార్డు కంచరపాలెం, లక్ష్మీనారాయణపురం, శాంతినగర్, డీఎల్‌బీ కాలనీ కొండవాలు ప్రాంతాల్లో సీతంరాజు సుధాకర్‌కు మద్దతుగా డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్ ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయా ప్రాంతాల్లో పట్టభద్రులకు ఆయన కరపత్రాలు అందజేసి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బలపరిచిన ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌కు మొదటి ప్రాధాన్యత ఓటును వేయాలని కోరారు.

బ్రాహ్మణులతో సీతంరాజు ఆత్మీయ సమావేశం

సీతంపేట: వైఎస్సార్‌సీపీ బలపర్చిన ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌కు మద్దతుగా వైజాగ్ బ్రాహ్మిన్ వెల్ఫేర్ సొసైటీ, వివిధ బ్రాహ్మణ సంఘాలు సంయుక్తంగా బుధవారం శంకరమఠంలో ఆత్మీయ సమావేశం నిర్వహించాయి. ఈ సందర్భంగా సీతంరాజు సుధాకర్ మాట్లాడుతూ ఈ నెల 13న జరిగే ఎమ్మెల్సీ ఎన్నికల్లో బ్రాహ్మణ సామాజిక వర్గం మొత్తం తనకు మద్దతు తెలిపి మొదటి ప్రాధాన్యతా ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు ద్రోణంరాజు శ్రీవత్సవ్, దేవదాయ



బ్రాహ్మణ సంఘాల ప్రతినిధులతో సీతంరాజు సుధాకర్

శాఖ సలహాదారులు జ్వాలపురి శ్రీకాంత్, రాజశేఖర్, సునీల్ మహంతి, కె.ఎస్.ఎన్.మూర్తి, కె.వి.నరసింహమూర్తి, కాపూరి చరణ్‌కుమార్, కోడూరి సుశీల, పెద్ద సంఖ్యలో బ్రాహ్మణులు పాల్గొన్నారు.

కేరింతలతో హోలీ



రామాటాకీస్ రోడ్డులో యువత హోలీ సంబరాలు

సీతంపేట: రంగుల పండగ హోలీని బుధవారం యువత, చిన్నారులు ఉత్సాహంగా జరుపుకున్నారు. ఫుల్ జోష్‌తో కేరింతలు కొడుతూ రంగుల్లో తడిసి ముద్దయ్యారు. తెల్లవారుజాము నుంచే రంగులు పట్టుకొని రోడ్డెక్కిన యువత తెలిసిన వారికి, బంధువులకు, స్నేహితులకు రంగులు పూసి హోలీ శుభాకాంక్షలు తెలిపారు. స్వీట్లు తినిపించుకున్నారు. చిన్నారులు, యువకులు రంగులు జల్లుకొని ఉల్లాసంగా గడిపారు. రామాటాకీస్ వద్ద



ఆక్సిజన్ టవర్స్‌లో హోలీ వేడుకలు

మార్వాడీ యువకులు పెద్ద ఎత్తున హోలీ వేడుకల్లో సందడి చేశారు. సీతంపేట, రాజేంద్రనగర్, మధురానగర్, శంకరమఠం, అక్కయ్యపాలెం, ఎన్జీవోస్ కాలనీ, శ్రీనివాసనగర్ ప్రాంతాల్లో యువకులు మధ్యాహ్నం వరకు ఫుల్ జోష్‌గా ఎంజాయ్ చేశారు.

ఆక్సిజన్ టవర్స్‌లో సందడి

సీతమ్మధార: సీతమ్మధారలో హోలీ వేడుకలు ఉత్సాహంగా నిర్వహించారు. ఆక్సిజన్ టవర్స్‌లో నివాసులు రంగుల వర్షం కురిపించారు. కుటుంబ సభ్యులు, యువకులు, చిన్నారులు, మహిళలు ఒకరిపై ఒకరు రంగులు జల్లుకొని సందడి చేశారు.

అద్దంలా రహదారి

- సత్యానగర్–1లో అందుబాటులోకి బీటీ రోడ్డు

మురళీనగర్: జీవీఎంసీ 49వ వార్డు సత్యానగర్–1 ప్రజలకు అద్దంలాంటి రహదారి అందుబాటులోకి వచ్చింది. ఈ ప్రాంతంలో రోడ్డు శిథిలమవడంతో స్థానికుల విజ్ఞప్తి మేరకు డిప్యూటీ ఫ్లోర్ లీడర్, కార్పొరేటర్ అల్లు శంకరరావు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని మరమ్మతులు చేయించారు. అనంతరం దీన్ని పూర్తి స్థాయిలో బీటీ రోడ్డుగా మార్చేందుకు ఆయన చర్యలు తీసుకున్నారు. ఇందు కోసం రూ.15 లక్షలు జీవీఎంసీ నిధులు మంజూరు చేశారు. ఈ ప్రాంతంలో 380కు టుంబాలు నివసిస్తున్నాయి. డిప్యూటీ ఫ్లోర్ లీడర్ అల్లు శంకరరావు ఆదేశాల మేరకు ఈ



సత్యానగర్–1లో కొత్తగా నిర్మించిన బీటీ రోడ్డు

ప్రాంతంలో 220 మీటర్లు పొడవు, 5 మీటర్లు వెడల్పు కలిగిన తారు రోడ్డును నిర్మించి బుధవారం ప్రజలకు అందుబాటులోకి తెచ్చారు. డీఈ భరణికుమార్, ఏఈ అర్చన మేరీ పర్యవేక్షణలో రహదారి నిర్మించారు. వర్క్ ఇన్‌స్పెక్టర్ రామరాజు ఏర్పాట్లు చేశారు. రహదారి సదుపాయం అందుబాటులోకి తెచ్చినందుకు కార్పొరేటరు అల్లు శంకరరావుకు స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.

11న సిరికోన పంచవర్ష సాహిత్యోత్సవాలు

మద్దిపాలెం: సిరికోన సాహితీ అకాడమీ ఆధ్వర్యంలో ఈ నెల 11న హైదరాబాద్ పబ్లిక్ గార్డెన్స్ పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం కమిటీ హాల్‌లో సిరికోన పంచవర్ష సాహిత్యోత్సవాలు నిర్వహించనున్నట్టు సాహితీ పురస్కార గ్రహీత స్వర్ణ శైలజ తెలిపారు. 51వ వార్డు మాధవధారలోని ఓ ఫంక్షన్ హాల్లో బుధవారం మీడియా సమావేశంలో ఆమె వివరాలు వెల్లడించారు. ఈ కార్యక్రమానికి ద్రావిడ విశ్వవిద్యాలయం పూర్వ ఉప కులపతి గంగిశెట్టి లక్ష్మీనారాయణ సభాధ్యక్షత వహిస్తారని, మధ్యాహ్నం 2.30 గంటలకు వేడుకలు ప్రారంభవుతాయని చెప్పారు. స్వీయ రచనల ప్రదర్శన, పుస్తకావిష్కరణలు, ప్రతిభాపురస్కారాలు, సాహితీ పురస్కార ప్రదాన కార్యక్రమాలు జరుగుతాయని, సాయంత్రం కవి సమ్మేళనం, పలువురికి సన్మానాలు ఉంటాయని వివరించారు.

కె.కె.రాజుకే మా సంపూర్ణ మద్దతు



మాట్లాడుతున్న ఐ.హెచ్.ఫారూఖీ

సీతంపేట: ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో వైఎస్సార్‌సీపీ నేతల మధ్య విభేదాలు సృష్టించేలా సోషల్ మీడియా, ఎల్లో మీడియాలో గుర్తు తెలియని కొంత మంది తనపై దుష్ప్రచారం చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ మైనారిటీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఐ.హెచ్.ఫారూఖీ అన్నారు. అక్కయ్యపాలెంలోని తన కార్యాలయంలో బుధవారం సాయంత్రం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విశాఖ ఉత్తర నియోజకవర్గ అసెంబ్లీ సీటుకు ప్రయత్నిస్తున్నట్టు తనపై సోషల్ మీడియా, ఎల్లో మీడియాలో చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని ఖండించారు. ఉత్తర సీటు విషయమై ముఖ్యమంత్రిని తాను అడిగినట్టు వచ్చిన వార్తల్లో ఏమాత్రం నిజం లేదన్నారు. తమ సంపూర్ణ మద్దతు ఎల్లప్పుడూ వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త, నెడ్‌క్యాప్ చైర్మన్ కె.కె.రాజుకే ఉంటుందని స్పష్టం చేశారు. ఆయన విజయానికి సంపూర్ణ సహాయ సహకారం అందిస్తామని తెలిపారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ విశాఖ జిల్లా మైనారిటీ సెల్ అధ్యక్షుడు కె.వి.బాబా, 53వ వార్డు కార్పొరేటర్ బర్కత్ అలీ పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మి ఆలయంలో ఆయుష్ హోమం

దాబాగార్డెన్స్: బురుజుపేట కనకమహాలక్ష్మి దేవస్థానంలో బుధవారం అమ్మవారి జన్మ నక్షత్రం (ఉత్తరా) సందర్భంగా ఆయుష్ హోమం జరిపారు. పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ప్రతి నెలా ఉత్తరా నక్షత్రం రోజున ఉదయం 9 గంటలకు నిర్వహించే ఆయుష్ హోమంలో భక్తులు రూ.2,516 పూజా రుసుం చెల్లించి పూజలో పాల్గొనవచ్చని ఆలయ ఈవో కె.శిరీష తెలిపారు. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నంబర్ 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్0806081లో చెల్లించి, ఆన్‌లైన్ ద్వారా ట్రాన్స్‌ఫర్ చేసిన వారు వివరాలు, పూజ జరిపించాల్సిన వారి పేరు, గోత్రనామాలు, పూర్తి చిరునామా, ఫోన్ నంబర్‌ను 89855 15989 వాట్సాప్ నంబర్‌కు పంపవచ్చు. కార్యక్రమంలో ఈవో శిరీషతో పాటు ఏఈవో వెంపలి రాంబాబు పాల్గొన్నారు.

వైభవంగా లక్ష్మీదేవికి అష్టోత్తర సేవ

ఎంవీపీ కాలనీ: ఎంవీపీ కాలనీ సెక్టార్–6లోని వేంకటేశ్వర స్వామి, ప్రసన్న ఆంజనేయ స్వామి ఆలయంలో కొలువైన శ్రీలక్ష్మీదేవి అమ్మవారికి బుధవారం అష్టోత్తర సేవ నిర్వహించారు. 108 కలశాలతో అత్యంత వైభవంగా ఈ సేవ జరిపారు. పంచామృతాలు, వివిధ రకాల పండ్ల రసాలతో అభిషేకం చేశారు. అనంతరం అమ్మవారికి ప్రీతికరమైన తామర పువ్వులు, పలు రకాల సుగంధ పుష్పాలతో పూజ జరిపారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.



బాధితురాలికి ఆర్థిక సాయం

కంచరపాలెం: జీవీఎంసీ 41వ వార్డు జ్ఞానాపురం బాబూ కాలనీలో నివసిస్తున్న నిమ్మడ రమణమ్మ కొద్ది రోజులుగా అనారోగ్య కారణంగా మంచాన పడ్డారు. ఆర్థికంగా వెనుకబడిన ఆ కుటుంబ పరిస్థితి గురించి వలంటీర్ లక్ష్మి కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన వైఎస్సార్‌సీపీ వార్డు సీనియర్ నాయకుడు కోడిగుడ్ల శ్రీధర్ రమణమ్మకు రూ.5 వేలను మందుల ఖర్చుల నిమిత్తం బుధవారం ఆర్థిక సాయం అందించారు.

మదర్ ఇండియా ట్రస్ట్‌కు కొత్త కార్యవర్గం



ట్రస్టు నూతన కార్యవర్గ సభ్యులు

సీతంపేట: ఎన్జీజీవోస్ కాలనీలో ఏర్పాటు చేసిన మదర్ ఇండియా వెల్ఫేర్ ట్రస్టు నూతన కార్యాలయాన్ని బుధవారం ట్రస్టు వ్యవస్థాపక అధ్యక్షుడు మళ్ల వెంకటరావు ప్రారంభించారు. ట్రస్టు ఏర్పాటై మూడేళ్లు పూర్తయిన సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ట్రస్టు చైర్మన్‌గా మళ్ల వెంకటరావు, గౌరవాధ్యక్షుడిగా బండి వెంకటేశ్వరరావు, కోశాధికారిగా ఇందిరా ప్రియదర్శిని, ప్రధాన కార్యదర్శిగా కందాల ప్రభాకర్‌రావు, ఉపాధ్యక్షుడిగా రాపేటి కృష్ణ, కార్యదర్శిగా కనిశెట్టి అప్పారావు నియమితులయ్యారు. సాంస్కృతిక విభాగానికి అధ్యక్షురాలిగా రెండో సారి సత్యమాధవి, మహిళా విభాగం గౌరవాధ్యక్షురాలిగా మళ్ల లక్ష్మి ఎన్నికయ్యారు. మహిళా ప్రధాన కార్యదర్శిగా కనకదుర్గ, కార్యదర్శిగా జెస్సీ, ఉపాధ్యక్షురాలిగా పిల్ల రేణుక నియమితులయ్యారు. కొత్త కార్యవర్గం మూడేళ్ల పాటు అధికారంలో ఉంటారని తెలిపారు. అనంతరం ట్రస్ట్ కార్యాలయంలో మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు.

మహిళా దినోత్సవం

మహిళా పక్షపాతి సీఎం జగన్



మేయర్ గొలగాని హరివెంకటకుమారికి కానుక అందజేస్తున్న నెడ్‌క్యాప్ చైర్మన్ కె.కె.రాజు

- మేయర్ గొలగాని హరివెంకటకుమారి
- ఘనంగా మహిళా దినోత్సవం

సీతమ్మధార: బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో 24వ వార్డు కార్పొరేటర్ సాడి పద్మారెడ్డి ఆధ్వర్యంలో బుధవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులు మేయర్ గొలగాని హరివెంకటకుమారి, నెడ్‌క్యాప్ చైర్మన్, పార్టీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి కేక్ కట్‌చేసి పంచిపెట్టారు. అనంతరం మేయర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహిళా పక్షపాతని, వారికి అన్ని రకాల ఆర్థిక స్వావలంబన కల్పించే దిశగా కృషి చేస్తున్నారన్నారు. ప్రతి సంక్షేమ పథకం మహిళలకు కేటాయించేలా ఒక ప్రణాళిక రూపుదిద్దారని చెప్పారు. కె.కె.రాజు మాట్లాడుతూ ప్రతి పదవిలో మహిళలకు 50 శాతానికి పైగా రిజర్వేషన్లు కేటాయించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌దేనన్నారు. జీవీఎంసీ, పంచాయతీ, ఇతర స్థానిక ఎన్నికల్లో మహిళలకు ప్రాధాన్యం కల్పించారన్నారు. ఎమ్మెల్సీ వరుదు కల్యాణి మాట్లాడుతూ అనేక పదవుల్లో మహిళలకు ముఖ్యమంత్రి జగన్ ప్రాధాన్యమిచ్చి గౌరవం చూపించారన్నారు. మహిళా దినోత్సవం సందర్భంగా మేయర్‌ను కె.కె.రాజు శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా మహిళా కో–ఆర్డినేటర్ గరికిన గౌరి, విశాఖ జిల్లా మహిళా అధ్యక్షురాలు నల్ల కృపా, కార్పొరేటర్లు శశికళ, ఉషశ్రీ, వార్డు అధ్యక్షురాలు పీలా వెంకటలక్ష్మి, సీనియర్ మహిళా నాయకురాలు పేడాడ రమణికుమారి, వార్డు అధ్యక్షులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మహిళల అభ్యున్నతికి అత్యధిక ప్రాధాన్యం

సీతంపేట: జీవీఎంసీ 43వ వార్డు జగన్నాథపురంలోని కమ్యూనిటీ హాల్‌లో ఎస్ఎల్ఎఫ్ గ్రూప్‌ల ఆధ్వర్యంలో బుధవారం మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. రిసోర్స్ పర్సన్ అలివేణి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సుమారు 40 గ్రూపులకు చెందిన సభ్యులు పాల్గొన్నారు. 44వ వార్డు కార్పొరేటర్, జీవీఎంసీ ఫ్లోర్ లీడర్ బానాల శ్రీనివాసరావు, 43వ వార్డు కార్పొరేటర్ పెద్దిశెట్టి ఉషశ్రీ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళల అభ్యున్నతి, సంక్షేమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అత్యంత ప్రాధాన్యమిస్తున్నారన్నారు. అన్ని రకాల పదవుల్లో మహిళలకు 50 శాతం కేటాయించి మహిళలకు పెద్దపీట వేశారని కొనియాడారు. ప్రభుత్వం కల్పిస్తున్న ప్రాధాన్యాన్ని సద్వినియోగం



కార్పొరేటర్ ఉషశ్రీని సత్కరిస్తున్న పొదుపు సంఘాల మహిళలు

చేసుకుని మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా క్రీడా, రాజకీయ రంగాల్లో రాణిస్తున్న కార్పొరేటర్ ఉషశ్రీతోపాటు వివిధ రంగాలలో సేవలందించిన పలువురు మహిళలను ఘనంగా సత్కరించారు.

జోన్-5 కార్యాలయంలో వేడుకలు

కంచరపాలెం: జీవీఎంసీ జోన్–5 యూసీడీ ఏపీడీ పద్మావతి నేతృత్వంలో జ్ఞానాపురంలోని జోనల్ కార్యాలయంలో మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా జోనల్ కమిషనర్ ఆర్.జి.వి.కృష్ణ, డీఎంసీ నాగరాజు వేడకలు ప్రారంభించి మహిళలను సత్కరించారు. సీవోలు,



మహిళా దినోత్సవంలో పాల్గొన్న అతిథులు

ఆర్పీలు, మహిళా ఉద్యోగులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మహిళా వాకర్స్ క్లబ్ వితరణ



నిత్యావసర సరకులు అందిస్తున్న మహిళా వాకర్స్ క్లబ్ సభ్యులు



మహిళలకు కానుకలు అందిస్తున్న ఆదిభట్ల రామకృష్ణ, రమామణి దంపతులు

మురళీనగర్: మురళీనగర్ వాకర్స్ పార్క్‌లో మాధవధార మహిళా వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం సేవా కార్యక్రమాలు నిర్వహించారు. పార్కుల్లో పని చేస్తున్న ఐదు కుటుంబాల మహిళలకు చీరలు, బియ్యం, నిత్యావసర సరకులు అందించారు. ఇండస్ ఇండ్ బ్యాంక్ ప్రతినిధులు పార్కులో మహిళలకు శుభాకాంక్షలు తెలిపి చిరుకానుకలు అందజేశారు. కార్యక్రమంలో మహిళా వాకర్స్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు ఎం.శేషామణి, ఎస్.పుష్పలత, పూర్వ అధ్యక్షులు కె.మాధవి, డి.శిరీష, వైస్ ప్రెసిడెంట్ వరలక్ష్మి ఎ.లక్ష్మి, ఎ.మహాలక్ష్మి, కృష్ణ వేణి, అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో.. : మురళీనగర్ వాకర్స్ పార్కులో వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన మహిళా దినోత్సవంలో వాకర్స్ క్లబ్ ఉపాధ్యక్షుడు ఆదిభట్ల రామకృష్ణ, రమామణి దంపతుల సౌజన్యంతో మహిళలను సత్కరించారు. వాకర్స్ క్లబ్ మహిళలకు పసుపు కుంకుమలు, బ్లౌజ్‌లు, గాజులు, తాంబూళాలు పంపిణీ చేశారు. మహిళా వాకర్స్, సందర్శకులకు చిరు కానుకలు అందించారు. వాకర్స్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు పల్లా చంద్రమౌళి, ఎల్‌వీ సుధాకర్, ఇతర కార్యవర్గ సభ్యులు, వనితా వాకర్స్ క్లబ్ అధ్యక్షురాలు ప్రభాశర్మ, పూర్వ అధ్యక్షురాలు జె.ఉమాదేవి, మహిళా వాకర్స్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు ఎం.శేషామణి, ఎస్.పుష్పలత, కె.మాధవి, ఓం వాకర్స్ క్లబ్ అధ్యక్షురాలు ప్రమీల పాల్గొన్నారు.

అతివల ఆత్మీయ కలయిక



గంగాగోదావరి అపార్ట్‌మెంట్‌లో మహిళల సందడి

మురళీనగర్: మురళీనగర్ సమీపంలోని గంగా గోదావరి అపార్ట్‌మెంట్ సముదాయంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. నిత్యం ఇళ్లు, ఆఫీసు పనులతో బిజీగా ఉండే మహిళలంతా ఆత్మీయంగా ఓచోట చేరి సందడి చేశారు. ఒకరికొకరు శుభాకాంక్షలు చెప్పుకున్నారు. అపార్ట్‌మెంట్ వాసులు వీరికి శుభాకాంక్షలు తెలిపారు.